క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



నాగారంలో సోమిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన కడారి సోమిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, కూరం వెంకన్న, చిప్పలపల్లి సోమయ్య, కన్నెబోయిన భద్రయ్య, కొనిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

దామోదర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో మద్దిరాల నాయకులు

మద్దిరాల : మాజీ మంత్రి, పీసీసీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి వెంకటయ్య, ఎలిపెద్ది మల్లారెడ్డి, నవ్వుల మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత సోమ్‌లాల్‌కు సన్మానం



పద్మశ్రీ గ్రహీత సోమ్‌లాల్‌ను సన్మానిస్తున్న పట్నం సుజాత-కమలాకర్ దంపతులు

అర్వపల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసి సోమ్‌లాల్‌కు కేంద్రం పద్మశ్రీ అవార్డును ప్రకటించడంతో జాజిరెడ్డిగూడేనికి చెందిన పలువురు సోమవారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో శారద ఎడ్యుకేషన్ చైర్ పర్సన్, కోశాధికారి పట్నం సుజాత, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి పట్నం కమలాకర్ దంపతులు ఉన్నారు.

టిప్పర్లు, ట్రాక్టర్ల పట్టివేత

సూర్యాపేట రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కంచికర్ల కీసర వాగు నుంచి అనుమతి లేకుండా రెండు టిప్పర్లలో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తుండగా మండలంలోని పిల్లలమర్రి స్టేజీ వద్ద పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా మండలంలోని భీమారం, టేకుమట్ల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ బాలునాయక్ హెచ్చరించారు.

దేవాలయంలో సీసీ నిర్మాణం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో సూర్యాపేటకు చెందిన కాంట్రాక్టర్ మొరిశెట్టి లక్ష్మాది స్వచ్ఛందంగా సీసీ నిర్మాణం పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసే ప్రదేశంలో సుమారు రూ.4 లక్షలతో సీసీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, భక్తులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

అర్వపల్లి : ఐదేళ్ల నుంచి గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ తమకు సహకరించిన తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవులపల్లి నవీన్ రెడ్డిని పలువురు మాజీ వార్డు మెంబర్లు సోమవారం సన్మానించారు. సన్మానించిన వారిలో వార్డు మెంబర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు దేశిడి సందీప్‌రెడ్డి, బొల్లం ప్రభాకర్ ఉన్నారు.



కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

అరకొర వైద్యం.. ప్రాణాలతో చెలగాటం!

- అర్హత లేనివారు కూడా డాక్టర్లుగా చెలామణి
- కొంతమంది ఆర్‌ఎంపీల నిర్వాహకం
- క్లినిక్‌లు ఏర్పాటు చేసి మరీ వైద్యసేవలు



సూర్యాపేట : ఆర్‌ఎంపీల వచ్చీరాని వైద్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది. పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. ఏకంగా క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ షాపు, రక్తపరీక్షలు, పడకలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. నిబంధనల ప్రకారం.. ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి. అయితే జిల్లాలో దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారే పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవాల్సి ఉంటుంది. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులు కాని కొంతమంది ఆర్‌ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా గతంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ వీరి తీరులో మార్పు కానరావడం లేదు. అయితే నకిలీ డాక్టర్లకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర వైద్య మండలి నిర్ణయం తీసుకుంది. అర్హత లేకున్నప్పటికీ ప్రాక్టీస్ చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

ఊరూరు తిరుగుతూ..

జిల్లాలో వందల సంఖ్యలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఉన్నారు. వారంతా ఆయా మండలాల్లోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ తిరుగుతూ రోగులకు ఇంజక్షన్లు, మాత్రలు ఇవ్వడంతో పాటు సెలైన్‌లు సైతం ఎక్కిస్తున్నారు. పల్లె ప్రజలకు వైద్యం ఖర్చుతో కూడుకున్నది కావడంతో వారు ఇంటికి వచ్చిన ఆర్‌ఎంపీలతోనే వైద్య సేవలు పొందుతున్నారు. ఒక్కోసారి వైద్యం వికటించి అవస్థలు పడుతున్న ఘటనలు అనేకంగా చోటుచేసుకున్నాయి. చేతులు, కాళ్లు వాపు రావడం, డోస్ ఎక్కువగా ఉండడంతో చర్మంపై దద్దుర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా తండాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీల ఆగడాలు మితిమీరుతున్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు స్థానికంగా పల్లె దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొంతమంది సర్కారు ఆస్పత్రులకు వెళ్లకుండా వీరి వద్దనే వైద్యం పొందుతున్నారు.

క్లినిక్‌లు ఏర్పాటు చేసుకుని..

కొంతమంది ఆర్‌ఎంపీలు, పీఎంపీలు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రంలో సైతం క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. అర్హత లేనప్పటికీ ప్రాక్టీస్ చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఎంబీబీఎస్ డాక్టర్లు, పీజీ చేసిన వైద్యులు సైతం ఉన్నప్పటికీ వీరి క్లినిక్‌లు మాత్రం ఎప్పుడు చూసినా కిటకిటలాడుతున్నాయంటే అతిశయోక్తి లేదు. ఎక్కువ మొత్తంలో వైద్య ఖర్చులు భరించలేని పేదల అవసరాన్ని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఆసరాగా చేసుకుంటున్నారు. క్లినిక్‌లో ప్రిస్క్రిప్షన్ రాసి అక్కడే వారు ఏర్పాటు చేసుకున్న మెడికల్ షాపులో మందులను విక్రయిస్తున్నారు. రోగుల బ్లడ్ శాంపిళ్లు తీసుకొని స్వయంగా రక్త, మూత్ర తదితర పరీక్షలు నిర్వహిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. మరోవైపు కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి, జ్వరం తదితర వాటితో బాధపడుతున్న రోగులకు పెయిన్ కిల్లర్, యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్ వంటివి నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్నారు. దీంతో తక్షణ ఉపశమనం పొందుతున్న జనం ఆ తర్వాత మరింత రోగాల బారిన పడుతున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రజలకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. వైద్యులుగా చెలామణి అవుతూ ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కించడం, రక్త పరీక్షలు చేపట్టడం చట్టరీత్యా నేరం. పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దు. క్లినిక్‌లు, మెడికల్ షాపులు ల్యాబ్‌లు ఏర్పాటు చేయరాదు. రోగులకు ప్రిస్క్రిప్షన్ రాయడం కూడా నేరమే. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ప్రజలు అర్హత గల వైద్యుల వద్దనే వైద్య సేవలు పొందాలి.

– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు

భానుపురి : పట్టణంలోని సిలోయం వర్షిప్ చర్చిలో నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎలక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ డాక్టర్ సాయిని జాకబ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుల్లూరి దానియేలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోక ఏసురత్నం, ఉపాధ్యక్షుడిగా జల గం పీటర్ బాబు, ప్రధాన కార్యదర్శిగా సాల్మన్ లింగ నాయక్, సహాయ కార్యదర్శిగా కందుకూరి ఏసు రాజు, కోశాధికారిగా ఇమ్మాన్యుయేల్, సభల కన్వీనర్‌గా ధరావత్ రవీందర్ నాయక్, కో కన్వీనర్‌గా దుబ్బ రాజరత్నం, మీడియా కన్వీనర్‌గా దుర్గం వెంకటయ్య, కో కన్వీనర్‌గా కలకొండ పాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ప్రసన్న కుమార్, శ్యాం ప్రసాద్, దామర్ల జోసెఫ్, నిమ్మనగొంటి జీవరత్నం ఎన్నికయ్యారు. వీరికి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ మామిడి సామ్సన్, అధ్యక్షుడు కాసర్ల శ్రావణ్ కుమార్, చీఫ్ అడ్వైజర్ సిల్వి సిలోయం నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ క్రిస్టియన్ కో ఆప్షన్ పెద్దపంగు స్వరూప రాణి, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పూర్ణ శశికాంత్, సుదర్శనం, పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

తిరుమలగిరి : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులపై ఖమ్మం జిల్లాలో పోలీసులు పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ కోరారు. సోమవారం తిరుమలగిరిలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన నాయకులపై ఆంధ్ర పాలకులు కక్షపూరితంగా రౌడీ షీట్ తెరిచారని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, కందుకూరి కొండయ్య, నర్సయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు వాటా కల్పించాలి



తిరుమలగిరిలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి : చట్టసభల్లో బీసీలకు వాటా సాధించేందుకు త్వరలో పాదయాత్ర చేపడతామని ఆలిండియా జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వైస్ చైర్మన్ వెలుగు వనిత అన్నారు. సోమవారం తిరుమలగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు, మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, అనంతుల శ్రీనివాస్, రాంప్రభు, వనజ, రమాదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

పెన్‌పహాడ్ : ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. సోమవారం ఆయన పెన్‌పహాడ్ మండల విద్యాధికారి నకిరేకంటి రవికి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సరస్వతి, శ్రావణి, మానస, ఆమని, ధనలక్ష్మి, కోటయ్య, సామమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : ఎంఈఓ నకిరేకంటి రవికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గ్రామీణ భారత్ బంద్‌పై ప్రచారం

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 16వ తేదీన నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మకూరు మండల పరిధిలోని పాతసూర్యాపేట గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సూరారపు వెంకన్న, హమాలీ యూనియన్ నాయకులు వీరబోయిన సైదులు, కునుకుంట్ల లక్ష్మారెడ్డి, నెమ్మాది ముత్తయ్య, దొడ్డి నాగయ్య, నారబోయిన మహేష్, సామ వెంకటరెడ్డి, బక్క వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురి కుటుంబాలకు చేయూత



అర్వపల్లి : కొమ్మాలలో ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి : కొమ్మాల గ్రామానికి చెందిన గంగదెరి లక్ష్మి, చెరుకుపల్లి సుదర్శన్, పెండెల వెంకన్నలు ఇటీవల వివిధ ప్రమాదాల్లో గాయపడ్డారు. దీంతో సోమవారం బాధిత కుటుంబాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, భాషపోలు శ్రీను, కుంటిగొర్ల శ్రీను, సూరారపు వెంకటాద్రి, గంగదెరి శ్రీను పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన వల్లపు మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మృతురాలు వల్లపు మల్లమ్మ కుమార్తె వల్లపు రేణుక చిన్ననాటి మిత్రులు సోమవారం మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.11,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, బాల్య మిత్రులు ఉప్పుల రాజు, చాగంటి వినోద్, మల్లేపాక లెనిన్, వర్దెల్లి రాములు, ఆలకుంట్ల సంపత్, గణేష్, లింగరాజు, ప్రశాంత్, సరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆత్మకూర్ (ఎస్) : ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన తమ మిత్రుడు రావుల లింగయ్య కుటుంబానికి ఏపూరు పాఠశాలకు చెందిన 1996 –97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం రూ.42 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ముల్కలపల్లి విజయనిర్మల, రావుల సంజీవ, ఫక్రుద్దీన్, పరికెపెల్లి రమేష్, గడ్డం నర్సిరెడ్డి, లింగానాయక్, సిరికొండ సురేష్, రమణాచారి, పెండెం కృష్ణ, అండెం సోమలింగం, ఇబ్రహీం పాల్గొన్నారు.



ఆత్మకూర్ (ఎస్) : ఏపూరులో ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు



తుంగతుర్తి : కొత్తగూడెంలో ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. సోమవారం కుంచమర్తిలో పశువుల గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, గోపాలమిత్రల సూపర్‌వైజర్ శ్రీనివాస్, రైతులు మన్నె నర్సయ్య, లింగయ్య, ఉగ్గం లింగరాజు, నాగరాజు, సుంకరి వీరసోములు, గోపాలమిత్రలు కుంభం సురేందర్, ఆల్దాస్ లింగయ్య, ఎస్.అర్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను పటిష్టం చేద్దాం

కోదాడరూరల్ : కోదాడ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ మండలంలోని అడ్లూరులో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈవూరి సత్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులును ఎన్నుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని వరప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రితో కార్పొరేట్ వైద్యం



తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



తిరుమలగిరి : ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సన్మానిస్తున్న నాయకులు



నాగారం : పస్తాలలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : తుంగతుర్తిలో నిర్మించే వంద పడకల ఆస్పత్రితో పేదల ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.44కోట్లతో నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రి భవనానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడి తుంగతుర్తిలో ఆస్పత్రి నిర్మాణానికి నెల రోజుల్లోనే నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. తుంగతుర్తిలో 18నెలల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తవుతుందని, ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే 5 లక్షల మందికిపైగా పేదలకు నిరంతరం వైద్య సేవలు అందుతాయన్నారు. గ్రామాలు, తండాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి రోడ్లు అనుసంధానం చేస్తానని హామీ ఇచ్చారు. వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో నీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం వైద్యాశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం, డాక్టర్లు వెంకటేశ్వర్లు, నిర్మల్‌కుమార్, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ భీంసింగ్, ఎంపీపీ గుండగాని కవితరాములు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, తిరుమలప్రగడ కిషన్‌రావు, దొంగరి గోవర్ధన్, రేతినేని శ్రీనివాసరావు, అవిలమల్లు, కృష్ణమూర్తి, అజయ్, కొండ రాజు, రాంబాబు, వెంకన్న, దీప్లా నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతు ఉంటుంది

తిరుమలగిరి : ఎస్సీ వర్గీకరణ ఈ నెల 6న సుప్రీం కోర్టులో బెంచ్ ముందుకు వస్తుందని, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ఈ నెల 7న నిర్వహించే కాంగ్రెస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, పాలకుర్తి రాజయ్య, పేరాల వీరేష్, కందుకూరి అంబేద్కర్, మూల అశోక్ రెడ్డి, కందుకూరి లక్ష్మయ్య, సుంకరి జనార్దన్, బత్తుల శ్రీను, రాపాక సోమేష్, రాముగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంపాల భిక్షం, రాంమూర్తి, రాజు, రవి, ఈశ్వర్, బుచ్చిబాబు, సోమయ్య, పుల్లయ్య, రమేష్, మధు, వెంకన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నాగారం : నాగారం మండల పరిధిలోని పస్తాల గ్రామానికి చెందిన పులుసు రమేష్, పులుసు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5,000 చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తొడుసు లింగయ్య, బుక్క శ్రీనివాస్, వడ్లకొండ వెంకన్న, చిత్తలూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

7న బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య, నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తిలోని సిరి ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 7న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగే నియోజకవర్గస్థాయి భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పులుసు వెంకటనారాయణ, మల్లేపాక వెంకన్న, రమేష్, శ్రీనివాస్, నరేష్, నాగమల్లు, మనోజ్, వెంకన్న, వీరునాయక్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వెంకన్న, రమేష్, వెంకనారాయణ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

నూతనకల్ : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి ఆశ్రితారెడ్డి వైద్యసిబ్బందిని కోరారు. సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు ఒక మాత్ర తాపించాలని సూచించారు. మూడు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు నులి పురుగుల మాత్రలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ తారమ్మ, సూపర్‌వైజర్ మాణిక్యం, చిన్ని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి

విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలి

నూతనకల్ : ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి శివయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యాసాగర్, వెంకన్న, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్

మద్దిరాల : 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలంటే విద్యార్థులకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం తప్పకుండా ఉండాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు ఈ నెల రోజులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు.



మద్దిరాలలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఎన్‌ఎస్‌యూఐ కమిటీ ఎన్నిక



శ్రీనివాస్‌గౌడ్

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఎన్ఎస్‌యూఐ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా నాతి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఈదుల విజయ్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ పరశురాములు, కోశాధికారిగా వడ్డే గణేష్, కో–ఆర్డినేటర్‌గా తాడోజు అజయ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాతి కర్ణాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులకు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్ నియామకపత్రాలను అందజేశారు. అనంతరం అధ్యక్షుడు నాతి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా జనరల్ సెక్రటరీ మాద మహేష్, మండల అధ్యక్షుడు మోదాల విజయ్, రాము, శ్రీశైలం, సాయి, లక్ష్మణ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

సూర్యాపేటటౌన్ : దశరథ మెమోరియల్ ఫౌండేషన్ వారు ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షలో సూర్యాపేట పట్టణంలోని న్యూ మిలీనియం పాఠశాలకు చెందిన బి.భానుచందర్‌నాయక్ ప్రథమ స్థానం పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ బాల్లు లక్ష్మీశ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ వారు విద్యార్థికి గోల్డ్ మెడల్‌తో పాటు రూ.1016 నగదు పారితోషికం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

మద్దిరాల : బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు తీవ్రంగా ఖండించారు. సోమవారం మద్దిరాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అలాగే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొబ్బిలి వెంకన్న, పచ్చిపాల వెంకన్న, కొమ్ము వెంకన్న, బర్పటి ఉపేందర్, తాళ్లపెల్లి సురేష్, పాక అమృతమల్లు, మల్లయ్య, ఉపేందర్, లింగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.